ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 1 జనవరి 2024

ధరల మోత

హిందూపురం, డిసెంబరు 31 : నూతన సంవత్సర వేడుకలకు అందరూ సిద్ధమయ్యారు. దీంతో కొన్ని వస్తువులకు వ్యాపారులు ధరలు విపరీతంగా పెంచారు. కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు బేకరీల్లో వివిధ రకాల కేక్‌లు సిద్ధం చేశారు. ధరలు అదేస్థాయిలో పెంచేశారు. కొన్ని రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లలో ఆఫర్లు ప్రకటించారు. బిర్యానీ కొంటే కూల్‌డ్రింక్ బాటిల్ ఉచితం. మరి కొన్నిచోట్ల వాటర్ బాటిల్ ఉచితమంటున్నారు. పూల ధర అమాంతం పెంచేశారు. రూ.100 బొకే రూ.200కి విక్రయిస్తున్నారు.

కలెక్టర్, ఎస్పీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

పుట్టపర్తి, డిసెంబరు 31: జిల్లా ప్రజలకు కలెక్టర్ అరుణ్‌బాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 9.30 నుంచి 12.00 గంటల వరకు పుట్టపర్తిలోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అందుబాటులో ఉంటారని కలెక్టరేట్ వర్గాలు తెలిపారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కేక్ కట్ చేసిన ఎస్పీ

పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ మాధవరెడ్డి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాస్థాయి స్పందన రద్దు

నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన జిల్లా స్థాయి స్పందనను రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

పోలీసు స్పందన కూడా..

సోమవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే జిల్లాస్థాయి పోలీసు స్పందనను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

పోలీసు శాఖలో స్పెషల్‌బ్రాంచ్ కీలకం: ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 31: పోలీసుశాఖలో స్పెషల్‌బ్రాంచ్ అత్యంత కీలకమని, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సమష్టిగా పని చేసి సవాళ్లను అధిగమించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన స్పెషల్‌బ్రాంచ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పోలీసుశాఖలో స్పెషల్‌బ్రాంచ్ అత్యంత కీలకమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాదకర సంఘటనల్లో అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పాతనేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని స్పెషల్‌బ్రాంచ్ సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్‌ను ఎస్పీ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ విష్ణు, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రనాథరెడ్డి, అర్బన్ సీఐ కొండారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం కల్చరల్, డిసెంబరు 31: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్ద తేడాలేకుండా అందరూ సంబరాలు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి హంగామా సృష్టించారు. కేక్‌లు కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. యువకులు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి హంగామా చేశారు. పట్టణాలు, నగరాల్లో నడిరోడ్లపై కేక్‌లు కట్ చేశారు. పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏ రోడ్డులో చూసినా సందడి కనిపించింది. పల్లెల్లో సైతం నూతన సంవత్సర సందడి కనిపించింది. అందరూ 2024 నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు.

అనంతపురంలోని క్లాక్‌టవర్ వద్ద నూతన సంవత్సర వేడుకల దృశ్యమాలిక..



కేక్ తినిపించుకుంటూ..

ఎలుగుబంట్ల హల్‌చల్..



నీలకంఠాపురం సమీపాన రోడ్డుపైకి వస్తున్న ఎలుగుబంట్లు

మడకశిర రూరల్ డిసెంబరు 31: మండలంలోని నీలకంఠాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా ఎలుగుబంట్లు గ్రామాల వైపు వస్తున్నాయిని గ్రామస్థులు తెలిపారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని గ్రామాల వైపు ఎలుగుబంట్లు రాకుండా చూడాలని వారు కోరారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న నిరసన



అనంతపురంలో మోకాళ్లపై నిలబడి కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

అనంతపురం క్రైం, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన ద్వారా నిరసన తెలిపారు. కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు నాగభూషణం, ఏటీఎం నాగరాజు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తొలుత నగరంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామిరెడ్డి, వెంకటనారాయణ, నల్లప్ప, శివప్రసాద్, ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు

కార్మికులు నిరసనకు దిగడంతో మున్సిపల్ అధికారులు... ప్రత్యామ్నాయ చర్యలకు దిగారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేయడానికి వెనకాడటం లేదట. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.50వేలు, ఎక్స్‌కవేటర్‌కు రూ.50వేలు చొప్పున 8 ట్రాక్టర్లు, 8 ఎక్స్‌కవేటర్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. వాటితో చెత్తను తరలించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు మండిపడుతున్నారు. విషయం మేయర్ చాంబర్‌లో మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లతో యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. కొవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు రూ.15వేల జీతం అడిగితే ఇవ్వని వారు ఇప్పుడు ఆ వాహనాలకు రూ.లక్షలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

ఏపీఎల్ విజేతలు నార్పల, రాప్తాడు జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31: ఏపీఎల్‌లో నార్పల, రాప్తాడు జట్లు విజయం సాధించాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఏపీఎల్ అండర్-16 బాల, బాలికల క్రికెట్ ఫైనల్స్ నిర్వహించారు. బాలుర మ్యాచ్‌లో రాప్తాడు (ఏఎస్‌వి) జట్టుపై నార్పల 31 పరుగుల తేడాతో గెలుపొంది ఏపీఎల్ విజేతగా నిలిచింది. బాలికల పోటీల్లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ జట్టుపై రాప్తాడు (ఏఎస్‌వి) జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి విజేతజట్లతోపాటు ఉత్తమ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వి మేనేజర్ శ్రీదేవి, కోఆర్డినేటర్ వంశీకృష్ణ, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నార్పల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు



బాలికల విజేత రాప్తాడు జట్టుకు ట్రోఫీ అందజేస్తూ..

అలరించిన అంతర్ధ్వని నాటిక



నాటికలోని ఓ దృశ్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, డిసెంబరు 31: సత్యసాయి భక్తులు అంతర్ధ్వని నాటిక ద్వారా అలరింపజేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక సాయికుల్వంత్ మందిరంలో అంతర్ధ్వని పేరుతో డ్యాన్సులు, పాటలతో అలరించారు. మొదట చిన్నారులు నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం భక్తులు భగవద్గీతలోని కొన్ని ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఇసుక అక్రమ తరలింపునకు పోలీసుల సహకారం

ఎమ్మెల్యేకు తొత్తులుగా మారారు

ఫోర్జరీ సంతకాలతో ఇసుక తరలింపు

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



ఎస్ఐతో వాగ్వాదం చేస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, డిసెంబరు31: వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి డీఎస్పీ గంగయ్యతోపాటు పోలీసులు తొత్తులుగా మారి ఇసుక అక్రమ తరలింపునకు సహకరిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. తాడిపత్రి మండలం వీరాపురం వద్ద ఉన్న పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం గ్రామస్థులతో కలిసి జేసీ అడ్డుకున్నారు. వాటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోజూ పెన్నానది నుంచి పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్నారన్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో టిప్పర్ల ఇసుకను తరలిస్తున్నారన్నారు. అధికారుల ఫోర్జరీ సంతకాలతో అనుమతుల పేరుతో ఇసుక వాహనాలను తరలిస్తున్నారన్నారు. అనుమతి పత్రాల్లో వీరాపురం వీఆర్వో సంతకాలు ఉన్నాయన్నారు. ఇసుక అక్రమ తరలింపునకు వీఆర్వో అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనుమతి పత్రాలపై సంబంధిత వీఆర్వోకు ఫోన్ చేయగా తాను సంతకాలు చేయలేదని చెప్పాడన్నారు. కేవలం వైసీపీ నాయకులు ఫోర్జరీ సంతకాలతో ఇసుకను తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఎస్ఐతో వాగ్వాదం

ఇసుక టిప్పర్లను జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకున్నాడని విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చారు. ఆ సమయంలో ఎస్ఐతో జేసీ వాగ్వాదానికి దిగారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకుంటుంటే ఎందుకొచ్చారని ప్రశ్నించారు. అనుమతి పత్రాల్లో ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని ఎస్ఐకి తెలిపారు. అనుమతి పత్రాలు ఒరిజనల్ అని రాసిస్తారా.. టిప్పర్లను ఇప్పుడే వదిలిపెడతానని అన్నారు. ఎస్ఐ నిరాకరించడంతో టిప్పర్లను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేయాలని సూచించారు. అనుమతి పత్రాలు ఇస్తున్న వ్యక్తి కూడా నకిలీ అని అతడిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పజెప్పిన టిప్పర్లపై కేసు నమోదు చేయకుంటే సోమవారం పెద్దఎత్తున ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. జనవరి 2 నుంచి పెన్నానది నుంచి ఇసుక తరలించే టిప్పర్లు, ట్రాక్టర్లను అడ్డుకుంటామని, వాటి టైర్లకు గాలి తీస్తామని తెలిపారు.

చరిత్రను తెలుసుకోవాలి: రఘువీరా

నొళంబవాడి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

హిందూపురం, డిసెంబరు 31: చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో గణిత ఉపాధ్యాయుడు సిద్దగిరి కోలెమొళ్ల శ్రీనివాస్ రచించిన నొళంబవాడి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఓ గణిత ఉపాధ్యాయుడు చరిత్రను పుస్తకరూపంలో తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. హేమావతి చరిత్ర రాజవంశానికి సంబంధించిన చరిత్రను క్లుప్తంగా తెలుగులో అందరికీ అర్థమయ్యేలా రచించడం గొప్ప విషయమన్నారు. హేమావతి చరిత్రను మరింత విస్తరించేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కవులు, రచయితలు, వక్తలు మాట్లాడుతూ.. ఈ ప్రాంత చరిత్రను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేటీ శ్రీధర్, ఎంఈఓ గంగప్ప, ఎంపీడీఓ నరేంద్ర, రచయిత చిదంబర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సురేష్, అంకె శ్రీనివాస్, నారాయణస్వామి, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి పలువురు ఎంపికయ్యారు. జిల్లా అథ్లెటిక్స్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-16 బాలబాలికల విభాగంలో జట్లను ఎంపిక చేశారు. వీరు ఫిబ్రవరి 16వతేదీ నుంచి గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అథ్లెటిక్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఇస్మాయిల్, కోకన్వీనర్లు రవికుమార్, సుదర్శన్ తెలిపారు.



పరుగు పందెంలో పోటీపడుతున్న బాలికలు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



ఆత్మకూరు, డిసెంబరు 31: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, మంగళహారతి ఇచ్చారు. అనంతరం హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, కార్యనిర్వహణాధికారి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్ష

అనంతపురం అర్బన్, డిసెంబరు 31: జిల్లాలోని 473 పశుసంవర్ధక సహాయకుడి (ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీ కోసం ఆదివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. జిల్లాకేంద్రం సమీపంలోని ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మి ఇంజనీరింగ్, ఎస్వీఐటీ, పీవీకేకే, శ్రీబాలాజీ పీజీ, తాడిపత్రిలోని సర్ సీవీ రామన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్షలకు 926 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 919 మంది హాజరైనట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలకు అనుమతి

అనంతపురం అర్బన్, డిసెంబరు 31: నూతన సంవత్సర ఆరంభం నేపథ్యంలో మద్యం దుకాణాల్లో విక్రయాలకు ప్రభుత్వం సమయం పెంచింది. ఆది, సోమవారం రెండు రోజుల్లో మద్యం దుకాణాల్లో రాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లల్లో అర్ధరాత్రి 1 గంట దాకా మద్యం విక్రయాలు జరిపేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఐఎంఎల్ డిపో మేనేజర్ రామమోహన్‌రెడ్డి తెలిపారు.

5న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, డిసెంబరు 31: జడ్పీ సర్వసభ్య సమావేశం జనవరి 5వ తేదీ నిర్వహించనున్నట్లు సీఈఓ కేతన్‌గార్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ జనరల్ బాడీ మీటింగ్ డిసెంబరు 26వ తేదీ నిర్వహించాల్సి ఉండగా 'ఆడుదాం-ఆంధ్రా' వల్ల వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. సభ్యులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పుట్టపర్తిలో చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 31: జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిలోని మనీఎక్స్ఛేంజ్ కార్యాలయంలో దుండగులు చొరబడి రూ.1.80 లక్షల నగదు అపహరించారు. సాయి ఫారెక్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దుండగులు షట్టర్‌కు ఉన్న తాళాలు తొలగించి ఫోరెక్స్‌లో ఉన్న నగదును అపహరించుకెళ్లినట్లు అందులో పేర్కొన్నాడు. అర్బన్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో క్లూస్‌టీం.. వేలిముద్రలు సేకరించింది. ఇటీవల కాలంలో దోపిడీలు, చోరీలు అధికమవుతున్నా.. వాటిని అరికట్టడంతో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు పట్టణవాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

నవరత్నాలు కాదు.. రంగురాళ్లు: కందికుంట



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న కందికుంట వెంకటప్రసాద్

కదిరి, డిసెంబరు 31: సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు రత్నాలు కాదని, అవి రంగురాళ్లని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన ముఖ్యమంత్రి 85శాతం ఫెయిల్ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ నవరత్నాల పేరుతో ప్రజలందరినీ మోసం చేశారన్నారు. అందులో ఏపథకమూ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఉద్యోగులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజల్ని దగా చేశారని మండిపడ్డారు. హామీలు వంద శాతం పూర్తి చేశామని డబ్బా కొడుతున్నారని, నిజానికి ఏ ఒక్క హామీని పూర్తి చేయలేదని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి కూడా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అభ్యర్థుల మార్పుతోనే ఇది స్పష్టమవుతోందని చెప్పారు. సమావేశంలో నాయకులు డైమెండ్ ఇర్షాన్, రాజశేఖర్ బాబు, సిరి బాబయ్య పాల్గొన్నారు.



సమష్టిగా పనిచేద్దాం: పల్లె



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జనసేన నాయకులు

కొత్తచెరువు, డిసెంబరు 31: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు సమష్టిగా పని చేసి అధికారాన్ని చేపడదామంటూ మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన 2024 క్యాలెండర్‌ను జనసేన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాక్షస పాలన నుంచి ప్రజల్ని కాపాడుకోవడానికి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు కలిసి కట్టుగా పోరాడుతున్నారన్నారు. వచ్చేది టీడీ పీ, జనసేన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామకోటి ఆది, మాణిక్యం బాబా, ఒలిపిశీన, డిపో భాస్కర్, శంకర్, జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్, పూల శివ, సల్లప్ప, బాబు, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్‌ఐగా మల్లికార్జునరెడ్డి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 31: ఉత్తమ ఎస్‌ఐగా కే. మల్లికార్జున రెడ్డి.. ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రశాంసాపత్రం అందుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన క్రైమ్ సమావేశంలో మల్లికార్జున రెడ్డికి ఉత్తమ ఎస్ఐగా ప్రశాంసాపత్రాన్ని ఎస్పీ అందించి అభినందించారు.



బుచ్చిరాజుపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలు ప్రదర్శిస్తున్న టీడీపీ శ్రేణులు

ఓబుళదేవర చెరువు, డిసెంబరు 31: మండలంలోని తంగేడుకుంట పంచాయతీ బుచ్చిరాజుపల్లిలో ఆదివారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేని ఫెస్టో పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు డ్రిప్ నాగరాజు, బ్లూస్టార్ శీనా, అబ్బాస్, మద్దక లక్ష్మీనారాయణ, బాలచంద్ర, కిష్ట, రంగనాథ్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

కందికుంట జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

తనకల్లు, డిసెంబరు 31: టీడీపీ నియోకవర్గ అధ్యక్షుడు కందికుంట వెంకట ప్రసాద్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించడానికి మండలకేంద్రంలోని షిర్డీసాయి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి, తెలుగుయువత నాయకులు ప్రవీణ్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.



ఫ్లెక్సీల వివాదం

ముదిగుబ్బ/ధర్మవరం, డిసెంబరు 31: ముదిగుబ్బలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం తొలగించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయులు డిమాండ్ చేయడంతో వివాదం తెలెత్తింది. దీంతో ఇరువర్గీయులు విమర్శలు చేసుకున్నారు.

గోనుగుంట్లపై శ్రీరామ్ ఫైర్

"40 ఏళ్ల చరిత్ర ఉన్న టీడీపీని రూ.100 కోట్లు పెట్టి కొంటానంటావా? నీ అహంకారాన్ని తగ్గించుకో" అంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణపై పరిటాల శ్రీరామ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "అన్నింటికీ తెగించే ధర్మవరం వచ్చా. నీ ఉడత ఊపులకు భయపడను" అని వార్నింగ్ ఇచ్చారు. రెండు రోజుల క్రితం గోనుగుంట్ల మాట్లాడుతూ.. పరిటాల కుటుంబం టీడీపీలో ఉంటూ కొన్నిచోట్ల వైసీపీ విజయానికి పని చేస్తోందని విమర్శించారు. దీనిపై శ్రీరామ్ ఘాటుగా స్పందించారు. ధర్మవరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన మాట్లాడారు. ధర్మవరంలోకి రావాలన్నా, టీడీపీ గురించి మాట్లాడాలన్నా గోనుగుంట్ల క్షమాపణ చెప్పాలన్నారు. కష్టకాలంలో నమ్ముకున్న జనాన్ని, కార్యకర్తలను నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయి.. ఇప్పుడు వచ్చి షోలు చేస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోనుగుంట్లను నమ్ముకున్న వారంతా తీవ్ర కష్టాల్లో ఉంటే.. ఆ రోజు అధినేత చంద్రబాబు ఆదేశాలతో తాను ధర్మవరంలో అడుగు పెట్టానన్నారు. పార్టీ నుంచి వెళ్లిపోతున్న వారిని ఒప్పించి, వారిలో ధైర్యం నింపి నిలబెట్టానన్నారు. ఈరోజు వాడవాడలా పార్టీ జెండా రెపరెపలాడిస్తున్నారన్నారు. వందకోట్లు పెట్టి కొంటానంటూ టీడీపీని తక్కువ చేసి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వందకోట్లు తీసుకుని వస్తే.. గోనుగుంట్లను పదిసార్లు కొంటానని వ్యాఖ్యానించారు. పార్టీలోకి రావాలనుకుంటే ధర్మవరం ప్రజలు, కార్యకర్తలకు క్షమాపణ చెప్పి రావాలన్నారు. ధర్మవరంలో లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తానని గోనుగుంట్ల ప్రకటిస్తున్నాడనీ, ఈ లెక్కన అవతలి వారికి ఓట్లే రావా అని ప్రశ్నించారు. ఇలాంటి మాటలు విని జనం నవ్వుకుంటున్నారని పరిటాల శ్రీరామ్ ఎద్దేవా చేశారు.

గోనుగుంట్లను విమర్శిస్తే సహించం

పరిటాల శ్రీరామ్‌పై గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు విమర్శలు గుప్పించారు. గోనుగుంట్ల ఎమ్మెల్యేగా ఉన్నపుడు నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తుంటే పరిటాల శ్రీరామ్ అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని ఆరోపించారు. ఆదివారం రాత్రి ధర్మవరంలోని గోనుగుంట్ల కార్యాలయంలో అనుచరులు మాట్లాడుతూ.. 2014లో ధర్మవరంలో శ్రీరామ్ తన అనుచరులను వైసీపీలోకి పంపారని, ఆయన ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టాక వారందరినీ తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారని ఆరోపించారు. ఇలాంటి కుమ్మక్కు రాజకీయాలు చేయడం తమ నాయకుడు గోనుగుంట్లకు చేతకాదన్నారు. కార్యక్రమంలో గోనుగుంట్ల అనుచరులు గొట్లూరు చంద్ర, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.





నేడు మల్లూరమ్మ ఉట్లోత్సవం

ఓబుళదేవర చెరువు, డిసెంబరు 31: మండలంలోని వెంకటాపురం పంచాయతీ నారప్పగారిపల్లిలో మల్లూరమ్మ గ్రామ దేవత ఉట్లోత్సవాన్ని సోమవారం ఘ నంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్థులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

కదిరి, డిసెంబరు 31: మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల ఉన్నతపాఠశాలలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి, రూ.10వేలు నష్టం జరిగినట్లు హెచ్‌ఎం వరప్రసాద్‌రాజు తెలిపారు. పాఠశాలలో వృథాగా ఉన్న గదిలో పనికిరాని ప్లాస్టిక్ డ్రమ్ములు, పదిబస్తాల సిమెంటు నాడు నేడు కింద మిగిలినవి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదంలో అవి కాలిపోయాయన్నారు. ప్రమాద విషయాన్ని స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చి మంటలను ఆర్పినట్లు తెలిపారు.





బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు


కదిరిఅర్బన్, డిసెంబరు 31: పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొని వాణి వీధికి చెందిన గంగులమ్మ అనే వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. కాలేజీ సర్కిల్లో ఆమె రోడ్డు దాటుతుండగా.. మడకశిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కదిరిఅర్బన్, డిసెంబరు 31: పట్టణంలోని శాంతినికేతన్ హైస్కూల్ కరెస్పాండెంట్ మెహీన్ సలీమ్ బాషా ఆదివారం అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేడాది చలికాలంలో బస్టాండ్, ప్రధాన కూడల్లో ఉంటున్న అనాథ వృద్ధులకు తమ పాఠశాల ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

బీజేపీలోకి పలువురి చేరిక

కదిరిఅర్బన్, డిసెంబరు 31: ఎన్పీకుంట మండలానికి చెందిన పలువురు ఆదివారం బీజేపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని ఆ పార్టీ కార్యాయంలో వారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో చేరారు.అనంతరం విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయినుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు తలుపుల గంగాధర్, ఆంజనేయులు, సుదర్శన్, వెంకటేష్, బీఎల్ ఆంజనేయులు, చంటి, నాగార్జున, షైనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.







ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన



తాడిమర్రిలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్

20వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



ముదిగుబ్బలో ఆటపాటలతో నిరసన..

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరింది. ఈ ఇందులోభాగంగా కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లోని పట్టణాలతో పాటు ఆయా మండలాల కేంద్రాల్లో వారు నిరసనలు, ఆందోళనలు చేశారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5క్షలు అమలు పరచడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి సీఐటీయూ, టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం

- మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ హెచ్చరిక

ధర్మవరం, డిసెంబరు 31: తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ పట్టణంలోని మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తొలుత వారు స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి గాంధీసర్కిల్ వరకు అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. పారిశుధ్య కార్మికసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మద్దతు ప్రకటించి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐటీయూ, ఏఐఎస్‌బీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: పట్టణంలోని మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు. పట్టణ పరిధిలో ఎవరైనా చెత్త తీయడానికి వస్తే అడ్డుకుంటామని యూనియన్‌నాయకుడు నాగార్జున, సీఐటీయూ నాయకుడు గంగాధర్ హెచ్చరించారు. రెండురోజులుగా అధికారులు, పాలకవర్గాలు చెత్తతీయడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం సైతం చెత్తతీయడానికి కొందరు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ప్రశాంతి నిలయం పరిసరాలు, ప్రధాన రోడ్లలో చెత్తతీయడానికి సహకరించాలని నాయకులు కోరినా, కార్మికులు ససేమిరా అన్నారు.



పుట్టపర్తిలో మోకాళ్లపై కూర్చుని అర్ధనగ్న ప్రదర్శన ద్వారా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, ధర్మవరంలో ర్యాలీ

కదిరిఅర్బన్: పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. వీరికి మద్దతుగా ఏఐటీయూసీ నాయకులు మధునాయక్, తిరుపాల్, కార్మిక సంఘం నాయకులు సమ్మెలో పాల్గొన్నారు.

నాయకుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

మడకశిర టౌన్, డిసెంబరు31: నియోజవకర్గ ప్రజలకు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాబోవు సంవత్సరంలో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను వందశాతం పూర్తి చేసిన బూత్‌ఇన్‌చార్జ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల సన్మాన కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న నూతన శుభాకాంక్షలు తెలిపారు. అమరాపురంలోని ఆయన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలతో పాటు ఈరన్న జన్మదిన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ ఆదినారాయణ పార్టీ నాయకులు తెలిపారు.

రొళ్ల : ప్రజలందరూ 2024 నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర వక్కళిగ సాధికార కన్వీనర్ వీఎం పాండుంగప్ప ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024లో టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని రాష్ట్ర ప్రజలకు మంచిరోజులు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు టీడీపీ నాయకుల హాజరు

హిందూపురం, డిసెంబరు 31 : పరిగి మండలం ధనాపురం గ్రామంలో మారికాంబదేవి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు జ్యోతులు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, పరిగి మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదాస జయంతి

మడకశిర రూరల్, డిసెంబరు 31: మండలంలోని ఉప్పిడిపల్లిలో కురుబకులస్థులు కనకదాస జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. కనకదాస చిత్రపటాన్ని గ్రామం మధ్యలో ఉంచి పూజలు చేశారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కురుబసాధికారిత కన్వీనర్ గోవిందప్ప, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గిరి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

అగళి, డిసెంబరు 31: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత కేసులపై ఆరాతీశారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలం కర్ణాటక సరిహద్దులో ఉందని ప్రతి చిన్న విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య ఉన్నారు.

గ్రానైట్ లారీ సీజ్

మడకశిర టౌన్, డిసెంబరు31: ఎలాంటి అనుమతులు లేకుండా గుడిబండ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరుకు గ్రానైట్ రాయిని తరలిస్తున్న లారీని మడకశిర మండలం కదిరేపల్లి క్రాస్ వద్ద సీజ్ చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. ఆదివారం తనఖీలు చేస్తుండగా గుడిబండ మండలంలోని ఓ క్వారీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రానైట్‌ను తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు తెలిపారు. రాయితోపాటు లారీని మడకశిర పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచి నట్లు తెలిపారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: గుండుమల

మడకశిర రూరల్, డిసెంబరు 31: టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకండని పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని ఛత్రం పంచాయతీ రంగాపురానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు చౌడప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గుండుమల గ్రామానికి వెళ్లి చౌడప్ప భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఛత్రం మాజీ సర్పంచు పాండు, మాజీ ఎంపీటీసీ నంజుండ, క్రిష్టప్ప, దాసప్ప, నర్సేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని బీజీహళ్లికి చెందిన టీడీపీ నాయకుడు గ్యారేగౌడ్(52) గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పిం చారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు సిద్దగంగప్ప, గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఈశ్వరప్ప, నారాయణప్ప, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.







పురంలో జగన్ మాస్క్‌తో కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీలు



పెనుకొండలో ఆటపాటలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల వినూత్న నిరసన

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక మడమ తిప్పాడని... ఇక ఈ ప్రభుత్వంతో కబడ్డీ ఆట ప్రారంభం అవుతుందని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. హిందూపురం, పెనుకొండ, మడకశిర పట్టణాలతో గోరంట్ల, చిలమత్తూరు, లేపాక్షి, అగళి, గుడిబండ, రొళ్ల తదితర మండలకేంద్రాల్లో దీక్షా శిబిరాల వద్ద అంగన్‌వాడీలు ఆటలు ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... 20రోజులుగా మహిళలు రోడ్డెక్కి నిరసన తెలుపుతుంటే ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు.



మడకశిరలో ఆటపాటలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



అగళిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వం మెడలు వంచే రోజులు దగ్గరపడ్డాయ్

: టీడీపీ నాయకులు

పారిశుధ్య కార్మికుల సమ్మెకు సంఘీభావం



అర్ధనగ్న ప్రదర్శనలో టీడీపీ నాయకులు, పారిశుధ్య కార్మికులు

హిందూపురం, డిసెంబరు 31: వైసీపీ ప్రభుత్వం మెడలు వంచే రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరింది. మునిసిపల్ కార్యాలయం ఎదుట ఉన్న నిరసన శిబిరం వద్ద రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్యకార్మికుల సమ్మెకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు రమేష్, సతీష్‌కుమార్, అమర్నాథ్ మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చాక పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను సీఎం జగన్ గాలికి వదిలేశారన్నారు. ఉదయం లేచే సరికి పట్టణమంతా పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులపై చూపుతున్న శ్రద్ధ ఇదేనా అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో అందరూ ఇళ్లలో ఉంటే ప్రాణాలకు తెగించి పరిశుభ్రత కోసం పాటుపడింది కార్మికులే అన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భారతి, కోరుముట్ల నాగేంద్ర, సుమోశీన, మోతుకపల్లి ఆనంద్, దుర్గానవీన్, భార్గవ్, సీఐటీయు నాయకులు రాము, జగదీష్, మల్లికార్జున, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం నగర పంచాయతీ కార్మికులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమేష్, బాబావలి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకుడు చిన్న వెంకటేష్, రిక్షావెంకటేష్, వ్యవసాయ జిల్లా కార్యదర్శి పెద్దన్న, సమాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు, నారాయణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మునెమ్మ, దివ్య భారతి, ముత్యాలప్ప, తిప్పన్న, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

వైసీపీలో ఆరని మంటలు

మార్పుపై పలుచోట్ల నిరసనలు



పరిగిలో రోడ్డుపై కూర్చుని ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

హిందూపురం, డిసెంబరు 31 : పెనుకొండ నియోజకవర్గానికి ఉషశ్రీ వద్దని, శంకరన్నకే టికెట్ ఇవ్వాలని పరిగి మండల కేంద్రంలో వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు నిరసన తెలిపారు. వారు ఆదివారం స్థానిక మడకశిర - హిందూపురం ప్రధాన రహదారిలో ఉన్న అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గంలో ఎన్ని మండలాలున్నాయో కూడా తెలియని ఉషశ్రీకి ఎలా ఓటువేయాలని ప్రశ్నించారు. శంకర్‌నారాయణ పదేళ్లుగా పెనుకొండ నియోజకవర్గంలో ఉంటూ కార్యకర్తలను, నాయకులను కలుపుకుని వెళ్తున్నాడన్నారు. కష్టకాలంలో ఆయన మా వెన్నంటే ఉన్నారని, అలాంటిది ఆయనను కాదని ఉషశ్రీని పెనుకొండ అభ్యర్థిగా ఎలా పంపుతారని ప్రశ్నించారు. మంత్రిగా ఉన్న రోజుల్లో ఒక్కరోజైనా మా ఊరికి వచ్చారా అంటూ అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. జగనన్న సైన్యం బాగుండాలంటే శంకర్‌నారాయణనే ఇక్కడ బరిలో దింపాలన్నారు. లేదంటే పరిస్థితులు దారుణంగా ఉంటాయని హెచ్చరించారు. ఉషశ్రీ వద్దు శంకరన్నే కావాలని ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రొద్దం: వైసీపీ తరుపున పెనుకొండ శాసనసభ టికెట్ శంకర్‌నారాయణకే ఇవ్వాలని రొద్దంలో వైసీపీ నాయకులు, సర్పంచులు నిరసన ర్యాలీ చేపట్టారు. రొద్దం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి బస్టాండు మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు ఆదివారం ర్యాలీగా వెళ్లారు. ఇతరులు వద్దు శంక రన్నే కావాలని నినాదాలు చేశారు. 2014నుంచి పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ పార్టీ కోసం అహర్నిశలు కృషిచేశారని, ఆయనకే టికెట్ ఇచ్చి ఆదుకో వాలని డిమాండ్ చేశారు. ఇతరులు వస్తే పార్టీకోసం కృషిచేసిన వారికి అన్యాయం చేసిన వారవు తారని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఈ సందర్భంగా విన్నవించారు. శంకర్‌నారాయణకు టికెట్ ఇవ్వకపోతే టీడీపీకి గెలుపు ఖాయం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయనను నమ్ముకుని పార్టీ కోసం కృషిచేసిన వైసీపీ శ్రేణులకు కష్టకాలం ఎదురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, సర్పంచులు రూప, పరమేష్, రాము, సోమిరెడ్డి, రామాంజనేయులు, డీలర్లు, ఎంపీటీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రొద్దంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు

ఎమ్మెల్యే తిప్పేస్వామికే మళ్లీ అవకాశం ఇవ్వాలి

వైసీపీ గుడిబండ నాయకులు



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

గుడిబండ, డిసెంబరు 31: వైసీపీ మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామికి కేటాయించాలని వైసీపీ గుడిబండ నాయకులు పేర్కొన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీపీ రాధమ్మ, మండల కన్వీనర్ బీఎల్ ఎంజేరేగౌడ్, సీనియర్ నాయకులు నాగన్న తదితరులు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... మడకశిర నియోజకవర్గం వైసీపీ అభివృద్ధికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఎంతో కృషిచేశారని అన్నారు. ఐదు ఎంపీపీ, నాలుగు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచుల గెలుపుకోసం కృషిచేశారన్నారు. నాన్‌లోకల్ అభ్యర్థి వద్దు లోకల్ అభ్యర్థే కావాలని కోరారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇస్తేనే 2024ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలుపొందుతారన్నారు. ఎమ్మెల్యే తిప్పే స్వామికి గిట్టనివారు లేనిపోని అసత్యప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. నాన్‌లోకల్ అభ్యర్థికి టికెట్ కేటాయిస్తే వైసీపీ అభ్యర్థి ఓడిపోవడం ఖాయమన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తిప్పేస్వామికి టికెట్ కేటాయించాలని వారు కోరారు. వైసీపీ నాయకులు శివకుమార్, తౌసిఫ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను రోడ్డుపై వేయకండి: కమిషనర్

పెనుకొండ, డిసెంబరు 31 : పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున పట్టణంలోని ఇళ్ల యజమానులు చెత్తా చెదారాన్ని రోడ్లపై , కాలువల్లో వేయరాదని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదట చేశారు. సమస్యల పరిష్కారం కోసం నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఈనెల 27నుంచి సమ్మె బాట పట్టారని, దీని కారణంగా పట్టణంలో పారిశుధ్య పనులు కుంటుపడ్డాయని కమిషనర్ పేర్కొన్నారు. తాత్కాలిక కార్మికులను నియమించి పారిశుధ్య పనులు చేయిస్తున్నా మన్నారు. కార్మి కుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని ఇంటి యజమానులు చెత్తా చెదారాన్ని రోడ్లపై, కాలువల్లో వేయరాదని కోరారు. కార్మికుల సమ్మె కారణంగా ఇంటింటి చెత్త సేకరణ కోసం మూడు రోజులకోసారి వాహనం మీ వీధు ల్లోకి వస్తుందని తెలిపారు. అంతవరకు చెత్తను ఇళ్లలోనే ఉంచుకుని ట్రాక్టర్లలో వేయాలన్నారు. కార్మికుల సమ్మె ముగిసే వరకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

టీడీపీతోనే కురుబలకు అన్నివిధాలా న్యాయం

పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 31: కురుబ కులస్థులకు రాజకీయంగానే కాకుండా అన్నివిధాలుగా టీడీపీతోనే న్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె టీడీపీ శ్రేణులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. వైసీపీ పేరుకు మాత్రమే కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటుచేసి, రూ.1 కూడా నిధులు కేటాయించలేదన్నారు. కుప్పంలో శనివారం కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కురుబ కులస్థులను అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే కురుబ కులాని చెందిన మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకొచ్చారని ఇందుకు నిదర్శనం తానేఅన్నారు. తనకు రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బాధ్యతలు ఇచ్చిన సంగతి తెలిసిందేనన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కురుబలకు సబ్సిడీ రుణాలు, గొర్రెల కాపర్లకు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10 లక్షల బీమా, మేతకు భూములు కేటాయిస్తామని చంద్రబాబు అన్నారన్నారు. అలాగే కురుబ విద్యార్థులకు ట్రైనింగ్ సెంటరన్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదిగేలా చేస్తామన్నారు. కురుబలు ఐక్యంగా ఉండి టీడీపీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మాధవనాయుడు, మాజీ మండల కన్వీనర్ ప్రసాద్, కౌన్సిలర్ గీతా హనుమంతు, రెడ్డివారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.







